దస్తగిరిపల్లెను భయపెడుతున్న విద్యుత్ తీగలు

దస్తగిరిపల్లి వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, రైతులు

- కరెంట్ తీగలకు కర్రలు పాతిన గ్రామస్తులు
- స్తంభాలు ఏర్పాటు చేయాలని వేడుకోలు
- అధికారుల వైఖరిపై నిరసన

పెద్దపల్లిరూరల్, ఏప్రిల్21: పెద్దపల్లి మండలం పెద్దకల్వల నుంచి కొలనూర్ వరకు ఓదెల మండలానికి వెళ్లే మార్గానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.9.04 కోట్లు మంజూరు కాగా, టెండర్ పొందిన కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణ పనుల మూలంగా కాంట్రాక్టర్, అధికారుల వ్యవహార శైలితో ప్రజలు, రైతులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతకాల్సిన పరిస్థితి దాపురించింది. రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న సందర్భంలో రోడ్డును మట్టి పనులతో ఎత్తు చేస్తున్న కాంట్రాక్టర్, సంబంధిత శాఖల అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ లైన్‌లను ఎత్తు పెంచడమా లేదా తొలగించాల్సి ఉన్నది. అయితే అవేమీ చేయకుండానే రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. దీంతో పెద్దబొంకూర్ నుంచి దస్తగిరిపల్లి గ్రామాల వద్ద విద్యుత్ లైన్లు రోడ్డు ఎత్తు పెరుగడం మూలంగా అటుగుండా ప్రయాణం సాగించే భారీ వాహనాలతో పాటు ఆయా గ్రామాల రైతులు, ఎడ్ల బండ్లకు ప్రమాదకరంగా మారా యి. చేతికందే అంత ఎత్తులో వేలాడుతున్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్‌గాని విద్యుత్ శాఖ అధికారులు, రోడ్లు భవనాల శాఖ అధికారులు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో దస్తగిరిపల్లె రైతులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక రైతులు, గ్రామస్తుల విజ్ఞప్తులను అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదు. దీంతో చేసేదేమిలేక ప్రమాదాల నుంచి తప్పించుకునేందుకు, తీగల బారి నుంచి ప్రాణాలను కాపాడుకోవడానికి ఆదివారం అధికారుల తీరును ఎండగడుతూ వేలాడుతున్న తీగల కింద పెద్ద పొడవాటి కర్రలను అమర్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రోడ్డు నిర్మాణ పనులను సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నాణ్యతా ప్రమాణాలు లేకుండా చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ఎత్తు కావడంతో వేలాడుతున్న తీగల నుంచి ప్రాణాపాయం పొంచి ఉందని చెప్పినా పట్టించుకోక పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకునేలా కలెక్టర్ అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.లేని పక్షంలో జరిగే పరిణామాలకు రోడ్డుపనులు చేస్తున్న కాంట్రాక్టర్, సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మిట్టపల్లి శ్రీనివాస్, బూర్ల కొమురయ్య, మొగుసాల అశోక్‌రెడ్డి, చిటవేన వినోద్‌కుమార్,బైరి సత్తయ్య, కొండిరవి, పర్స మల్లేశం, సత్యనారాయణ రెడ్డి ,వెంగళ రాజయ్య, బడిపెల్లి కుమార్, సాగర్, గుండు రాజు పాల్గొన్నారు.

గ్రంథాలయం సందర్శన

సుల్తానాబాద్‌రూరల్, ఏప్రిల్21: మండలంలోని కదంబాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష మాట్లాడారు. యువతను ముందుకు నడిపిస్తు, ఎంతో మంది విద్యార్థులు ప్రయోజకులు కావాలనే కలలను నెరవేర్చడం కోసం గ్రంథాలయం ఏర్పాటును మాజీ సర్పంచ్ కోడెం సురేఖ-అజయ్ మంచి కార్యక్రమం చేపటడం అభినందనీయమన్నారు. అలాగే మండలంలోని మియాపూర్ గ్రామానికి చెందిన లచ్చయ్య ఇల్లు ఇటివల కాలి పోయింది. వారి కుటుంబాన్ని దాసరి ఉష పరామర్శించారు. ప్రమాదానికి గల కారాణాలను అడిగితెలుసుకున్నారు. ఇల్లుతో పాటు సామగ్రి కాలిపోయిన భాధిత కుటుంబానికి ప్రభుత్వం అర్థిక సహాయం అందించి అదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఫకీర్ యాదవ్, మాజీ సర్పంచ్ కోడెం అజయ్, నాయకులు రాజయ్య, వెంకటేశ్, ప్రభాకర్, అరుణ, వహీద్, కుమార్, హరికృష్ణ, అజయ్, రవీందర్‌రెడ్డి, శివకుమార్, పవన్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

రామగుండం..నీటి గండం

- డెడ్ స్టోరేజీకి దగ్గరగా ఎల్లంపల్లి ప్రాజెక్టు..?
- బల్దియాలో రెండు రోజులకోసారి తాగునీటి సరఫరా..
- మున్ముందు తాగునీటికి కటకటే

గోదావరిలో తగ్గుతున్న నీటి మట్టం

కోల్‌సిటీ, ఏప్రిల్ 21: రామగుండం బల్దియాకు తాగునీటి గండం తరుముకొస్తున్నది. ఎండలు మండుతుండడంతో నీటి సమస్య తీవ్రరూపం దాల్చుతున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ డెడ్‌స్టోరేజీకి దగ్గరగా వస్తుండడంతో నగర జనం ఆందోళన చెంతున్నది. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టాలని ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నది.

రామగుండం నగరానికి ఇటీవల కాలంలో ఎన్నడూలేనివిధంగా తాగునీటికి తండ్లాడే పరిస్థితి వస్తున్నది. భూగర్భజలాలు అడుగంటడం, బోర్లు ఎత్తిపోవడంతో గుక్కెడు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. కేసీఆర్ సర్కారు మిషన్ భగీరథ కింద నిరాఘుటకంగా నీరందించింది. దీంతో మండు వేసవిలోనూ నగరజనం నిశ్చింతగా ఉండేది. పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, మంథని, పెద్దపల్లి మూడు నియోజక వర్గాలకు తాగునీరు సరఫరా చేస్తున్న ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి దగ్గరగా వస్తుండడంతో అధికారులు ప్రత్యమ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇటీవల రామగుండం మండలం ముర్మూరు గ్రామం వద్ద గల వాటర్ ప్లాంట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రామగుండం కార్పొరేషన్‌లోని 50 డివిజన్లకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మిషన్ భగీరథ అధికారులు రంగంలోకి దిగి గ్రిడ్‌ను పూర్తిగా ఆఫ్ చేసి మోటర్లకు కెపాసిటర్లను అమర్చి నీటి సరఫరాను పునరుద్ధరించారు. మున్ముందు ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిగా డెడ్ స్టోరేజీకి చేరుకుంటే ఇక రామగుండం కార్పొరేషన్ ప్రజలకు తాగునీటి గండం మరింత తీవ్రరూపం దాల్చనున్నది. ఈ గండం నుంచి గట్టెక్కేందుకు అధికార యంత్రాంగం ఇప్పటి నుంచి ప్రత్యమ్నాయ చర్యలు చేపట్టాల్సి ఉన్నది. ఇదిలా ఉండగా రామగుండం కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖనిలో రెండు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా జరుగుతుండడంతో ప్రజలు గత పదేళ్ల కిందటి కష్టాలను తలచుకొని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, పోనీ రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేసినప్పటికీ అది కూడా సమయాన్ని కుదించి కేవలం గంటలోపు వరకే ఇవ్వడంతో కనీస అవసరాలు తీర్చుకోలేని దుస్థితి నెలకొన్నది.

నాడు భగీరథతో తొలగిన కష్టాలు..

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలతో గోదావరి నిండుకుండలా ప్రవహించినది. రామగుండం బల్దియా పరిధిలోని రామగుండం, ఎన్టీపీసీ, గోదావరిఖని, యైటింక్లయిన్ కాలనీలకు నిరంతరం నీటి సరఫరా జరుగుతున్నది. రామగుండం మండలం ముర్మూరు వద్ద గల వాటర్ ప్లాంట్ నుంచి నీటిని శుద్ధి చేసి ఆ జలాలను పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజక వర్గాలకు సరఫరా చేస్తుండేది. ముర్మూరు వాటర్ ప్లాంట్ నుంచి రామగుండం నియోజక వర్గానికి ఒక రోజు 39 మిలియన్ లీటర్ల నీళ్ల అవసరాలను తీర్చేది. అలాగే ఈ ప్లాంట్ నుంచే హైదరాబాద్‌కు శుద్ధిచేయకుండానే నీటిని పంపిస్తున్నది. రామగుండం కార్పొరేషన్ పరిధిలో గతంలో 20వేల నీటి కనెక్షన్లు ఉండగా, మిషన్ భగీరథ అమలుతో 41వేల కనెక్షన్లు పెరిగాయి. వీటిలో ఎల్కలపల్లి, న్యూమారెడుపల్లి గ్రామాలకు ప్రతి రోజూ క్రమం తప్పకుండా నీటిని సరఫరా చేస్తుండగా, మిగతా ప్రాంతాలకు రోజు విడిచి రోజు మంచినీటిని పుష్కలంగా సరఫరా చేసేంది. కొత్తగా నిర్మించిన పీఎస్ లైన్ ద్వారా లీకేజీల సమస్యలకు స్వస్తి పలికింది. కార్పొరేషన్ పరిధిలోని బీ పవర్‌హౌస్, ఎన్టీపీసీ హెలిప్యాడ్, శారదానగర్, అశోక్‌నగర్, పాత మున్సిపల్ ఆఫీసు, సంజయ్ గాంధీనగర్, రమేశ్‌నగర్ మెటర్నిటీ హాస్పిటల్, ఎల్కలపల్లి, అల్లూరు, మారెడు పాక ప్రాంతాల్లో గతంలోనే సుమారు రూ.1.30 కోట్ల తో నీటి ట్యాంకులను నిర్మించగా, విఠల్‌నగర్, సీఎస్పీ-1, భీమునిపట్నంలో అదనంగా రూ.30లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన నీటి ట్యాంకులతో నిరంతరం నీటి సరఫరా జరిగేది.

ముర్మూరు వద్ద గుట్టపై మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్

పదేళ్ల తర్వాత మళ్లీ నీటి సమస్య

పదేళ్ల తర్వాత రామగుండం కార్పొరేషన్‌లో తాగునీటి కష్టాలు మొదలవుతున్నాయి. ముందు చూపులేని అధికారుల తీరుతో ఇక్కడి ప్రజలు నీళ్ల కోసం అరిగోస పడుతున్నారు. గోదావరి నదిలో నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పట్టి పదేళ్ల కిందటి పరిస్థితి పునరావృతమైంది. ముర్మూరు వద్ద గల వాటర్ ప్లాంట్ నుంచి బీ పవర్‌హౌస్ మీదుగా రామగుండం కార్పొరేషన్‌లోని 50 డివిజన్లకు మంచినీటి సరఫరా జరగాల్సి ఉండగా, అటు ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడం, ఇక్కడ గోదావరి నది ఫిల్టర్ బెడ్ వద్ద కార్పొరేషన్ అధికారులు ప్రత్యమ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో తాగునీటి కటకట మొదలైంది. మొన్నటివరకు రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా జరిగేది. ప్రస్తుతం రెండు రోజులకు ఒకసారి అది కూడా కేవలం గంట పాటే ఇస్తున్నారు. కార్పొరేషన్‌లోని కొన్ని ఏరియాలకు రెండు రోజులు గడిచినా నీటి సరఫరా జరగడం లేదు. ఈ నెలలోనే పరిస్థితి ఇట్లా ఉంటే వచ్చే ఏప్రిల్‌లో పరిస్థితులు ఎట్లా ఉంటాయోనని ప్రజానీకం ఆందోళన చెందుతున్నది.

నీళ్లు కొనుక్కునే రోజులు వచ్చాయ్..

నగరంలో మూడునాలుగు రోజులకోసారి నీటి సరఫరా జరుగుతున్నది. ఎండకాలం ముందే నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం గోదావరినదిలో నీటి నిల్వలు అడుగంటుతున్నయ్, ఎల్లంపల్లిలో నీటి మట్టం తగ్గి మూడు రోజులకు నీళ్లు వస్తున్నయ్. కొన్ని ఏరియాల్లో నీటి సరఫరా కూడా లేక ప్రజలు అరిగోస పడుతున్నరు. ఇప్పుడు నీళ్లు కొనుక్కునే రోజులు వచ్చినయ్.

-మద్దెల దినేశ్, ఫైవింక్లయిన్ కాలనీ, గోదావరిఖని

గోదావరి పుష్కరఘాట్ మెట్ల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

గోదావరి... పట్టించుకునే వారేరి...?

కోల్‌సిటీ,ఏప్రిల్ 21: పవిత్ర గోదావరి ఇప్పుడు అపవిత్రమవుతోంది. రామగుండం నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తున్నది. గోదావరిఖని శివారు గోదావరి పుష్కర ఘాట్ వద్ద నిత్యం వందలాది మంది భక్తులు వచ్చి స్నానాలు చేస్తుంటారు. అనంతరం తీరాన ఉన్న పరమ శివుడి సన్నిధిలో పూజలు చేసుకొని వెళ్తుంటారు. ఐతే కొద్ది రోజులుగా నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగం అధికారు లు అక్కడ పారిశుధ్య పనుల విషయంలో పూర్తిగా చేతులెత్తేశారు. దీనితో పుష్కరఘాట్ మెట్ల వద్ద పారిశుధ్యం లోపించి... చెత్త చెదారం పేరుకపోయి దుర్వాసన వెదజల్లుతోంది. స్నానాలు ఆచరించేందుకు వెళ్లే భక్తులు కనీసం గోదావరిలోకి దిగేందుకు కూడా వీలులేకుండా పోతున్నది. గత్యంతరం లేక ఆ మురికి నీటిలోనే స్నానమాచరించి శివ..శివా... మన్నించు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదావరి పవిత్రతను కాపాడాలని వేడుకుంటున్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

బోల్తాపడిన కారు

పెద్దపల్లిరూరల్, ఏప్రిల్21: పెద్దపల్లి మండలం అందుగులపల్లి శివారులో ఆదివారం కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలు కాగా ఆ సమయంలో ఎలాంటి పెద్ద వాహనాలు జాతీయ రహదారిపై రాకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. బసంత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన ఉప్పు సాగర్, ఉప్పు శ్రీనివాస్, నల్ల తీగల అంజి అనే నలుగురు బసంత్‌నగర్‌లో పెళ్లికి హాజరై తిరుగు ప్రయాణంలో పెద్దపల్లి మండలం అందుగులపల్లి శివారులో అదుపు తప్పి కారు బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం వారిని పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ముత్తారం, ఏప్రిల్ 21: ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటన ముత్తారం మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై ఆదివారం చోటు చేసుకుంది. వివరా లిలా ఉన్నాయి. మానేరులో ఏర్పాటు చేసిన క్వారీకి ఇసుక కోసం వచ్చిన లారీని డ్రైవర్ రోడ్డుకు ఒకవైపుగా నిలపడంతో ఇదే క్రమం లో ఓడేడు నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు పాక్షికంగా ధ్వంసమైంది. ఆర్టీసీ బస్సు వెనుకభాగంలో కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ప్రయాణికులు ఎక్కువగా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని రూట్ క్లియర్ చేశారు.

సార్వత్రిక విశ్వవిద్యాలయం సేవలు శ్లాఘనీయం

మంథని రూరల్, ఏప్రిల్ 21: ఉన్నత విద్యలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సేవలు శ్లాఘనీయమని సమన్వయకర్త కర్నాటి కృష్ణ అన్నారు. ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంథనిలోని అభ్యాసకుల సహాయ కేంద్రంలో అభ్యాసకుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెగ్యులర్‌గా చదువుకోలేని వారికి అవసరమైన ఉన్నత విద్యను అందించడంలో అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కృషి అశేషమైనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు యూనివర్సిటీకి సంబంధించిన అడ్మిషన్ ప్రక్రియ, అకాడమిక్ క్యాలెండర్ నమూనా, పరీక్ష పత్రాలు ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తిరుపతి, మానస, అమర్నాథ్, సెంటర్ సిబ్బంది రాజు, సురేష్, పాల్గొన్నారు.

సంకల్ప ప్రతిజ్ఞలో భాగస్వాములు కావాలి

జూలపల్లి, ఏప్రిల్ 21 : జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామానికి చెందిన మాజీ మంత్రి, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించుకోడానికి నిర్వహిస్తున్న 'సంకల్ప ప్రతిజ్ఞ'లో మండల వాసులు భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ నేత మారం తిరుపతి యాదవ్ విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌లో తెలంగాణ వాణి విన్పించడానికి మన మండలానికి చెందిన ఈశ్వర్‌కు అవకాశం కల్పించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఎన్నికల్లో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఈశ్వర్‌ను గెలిపించుకోవాలని కోరారు. మండల ప్రజలు తమ బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు సమాచారం అందించి గెలుపునకు కృషి చేయాలని తెలిపారు. ఈ నెల 23న మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సంకల్ప ప్రతిజ్ఞకు పెద్దయెత్తున తరలి రావాలని కోరారు.

హెచ్‌సీఏ క్రికెట్ క్యాంపునకు సీఎన్‌సీ విద్యార్థులు

క్రీడా శిక్షణ శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు

రామగిరి, ఏప్రిల్ 21: మండలంలోని సెంటినరీ కాలనీకి చెందిన పలు పాఠశాలల విద్యార్థులు క్రికెట్ క్యాంపుకు ఆదివారం తరలివెళ్లారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో ఒక సమ్మర్ క్రికెట్ క్యాంపు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా పెద్దపల్లి జిల్లాకు చెందిన క్యాంపును గోదావరిఖని జీఎం కాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. హెచ్‌సీఏ అధ్యక్షులు అర్శనపల్లి జగన్మోహన్ రావు, కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఆగమరావు, ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు ఆధ్వర్యంలో కోచ్ కిరణ్‌కుమార్ క్యాంపు నిర్వహిస్తున్నారు. సెంటినరీకాలనీకి చెందిన పల్లె సాక్షిత్ రావు, వరుణ్, హర్షవర్ధన్, విన్ను, శశాంక్, అర్జున్ రాజ్, జాగృతి, లక్ష్మీరాజ్, సాత్విక్, అవేజ్‌బేగ్ ఈ క్యాంపులో శిక్షణకు వెళ్లారు. మే 20వ తేదీ వరకు క్యాంపును గోదావరిఖనిలో నిర్వహిస్తారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 21: గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూలు విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. విశ్వ హిందూ పరిషత్ సభ్యులు రాములు కోరిక మేరకు లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం సౌజన్యంతో శనివారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వీటిని అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తాని పర్తి విజయలక్ష్మీ మాట్లాడుతూ హిందూ ధర్మప్రచారానికి పునఃవైభవం తేవడానికి చిన్నపిల్లల్లో మానవీయ విలువలు, భక్తి విశ్వాసాలు పెంపొందించడానికి భగవద్గీత పఠనం దోహద పడుతుందన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే శాస్త్రీయ పద్ధతులు అలవర్చుకోవడం వల్ల క్రమశిక్షణతో పెరుగుతారని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు జయప్రద, ఉమ, లయన్ ఆంజనేయులు, వీహెచ్‌పీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేణుగోపాల్ సార్ ఇక లేరు..

- చదువు చెప్పిన గురువు అంత్యక్రియలకు అన్నీ తామై...
- శోకసంద్రంలో పూర్వ విద్యార్థులు...

వేణుగోపాల్ (ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 21: ఆయన నడక.. నడవడిక అందరికీ ఆదర్శం..తనకంటూ తరగని ఆస్తి ఒక్కటే చదువు... అదొక్కటే చివరిదాకా ఆయన వెంటే ఉంది.. అంతే తప్ప తనకంటూ ఏలాంటి ఆస్తి సంపాదించుకోలేదు. కానీ, నలుగురిని మాత్రం సంపాదించాడు.. ఆయనే గోదావరిఖనికి చెందిన తొలితరం గురువు పీ వేణుగోపాల స్వామి. స్థానిక తిలక్‌నగర్‌లోని గీతా విద్యాలయంలో తొలితరం ఉపాధ్యాయుడిగా వేణుగోపాల్ చేరి ఎంతోమందికి క్రమశిక్షణతో కూడిన విద్యనందించారు. అలా ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెటిన వేణుగోపాల స్వామి జీవిత భాగస్వామి కళ కూడా అదే వృత్తిలో భర్త వెంటే నడిచేది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. గీతా విద్యాలయం మూసివేశాక శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో టీచర్‌గా చేరిన వేణుగోపాల స్వామి తమ బిడ్డలకు ఎలాగో పెళ్లిళ్లు చేశాడు. భార్య కళ పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, అప్పటి నుంచి ఒంటరిగా ఉపాధ్యాయ వృత్తిలోనే కొనసాగుతున్న ఆయన అనుకోకుండా అనారోగ్యం బారిన పడ్డారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున గుండెపోటుతో చనిపోయాడు. ఈ విషయం తెలిసి ఆయన శిష్యులు, తోటి ఉపాధ్యాయులు దిగ్భ్రాంతికి గురయ్యారు. అద్దె ఇంట్లో ఉంటున్న ఆయన అంత్యక్రియలకు స్థానిక చౌరస్తా అడ్డా టాటా మ్యాజిక్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ అమర్‌సిద్ది ముందుకు వచ్చి గురు భక్తి చాటుకున్నాడు. అంత్యక్రియల నుంచి మొదలు పెద్దకర్మ వరకు పూర్తి ఖర్చులు తానే భరించేందుకు ముందుకు రావడం పలువురి హృదయాలను కదిలించింది. ట్రస్మా తరపున రూ.10వేలు, శ్రీరామ విద్యానికేతన్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం జ్యోతి మరో రూ.10వేలు ఖర్చులకు అందించారు. కాగా, నాలుగు దశాబ్దాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి తనకుంటూ ఏమి లేకుండా మంచి పేరు సంపాదించుకున్న వేణుగోపాల్ మృతి పట్ల గీతా విద్యాలయం పూర్వ విద్యార్థులు, పలువురు సంతాపం ప్రకటించారు.

ఆదివరాహ స్వామి ఆలయంలో పూజలు

ప్రిన్సిపల్ సెక్రటరీకి బొట్టు పెడుతున్న అర్చకుడు

కమాన్‌పూర్, ఏప్రిల్ 21: రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ శశాంక్ గోయల్ ఆదివారం కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ఆదివరాహ స్వామిని దర్శింపచుకున్నరు. సహజ సిద్ధంగా వెలసిన ఆదివరాహ స్వామి క్షేత్రాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని ఆయన అన్నారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన శశాంక్ గోయల్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించాక ఆయన్ను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట తాసీల్దార్ అరీఫొద్దిన్, ఆర్ఐ సాముదాన్ తదితరులున్నారు.

దేహదానం అభినందనీయం

శాంతయ్య కుటుంబ సభ్యులకు మెమొంటో అందిస్తున్న ఎమ్మెల్యే

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్21: మెడికల్ కళాశాలకు దేహదానం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన ఇల్లందుల శాంతయ్య ఇటీవల మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులు శాంతయ్య మృతదేహాన్ని కరీంనగర్ ప్రతిమ కళాశాలకు దానం చేశారు. ఈ సందర్భంగా పందిల్ల లో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శాంతయ్య సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే విజయరమణారావు, సదాశయ ఫౌండేషన్ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. శాంతయ్య కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. మట్టిలో కలిసిపోమే శరీరాన్ని కళాశాల విద్యార్థులు పరిశోధన చేసేందుకు అందించడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఇక్కడ మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, ఎంపీటీసీ రావి సదానందం, నాయకులు గాజనవేన సదయ్య, ఇల్లందుల రమేశ్, మాదాసి సతీశ్, సబ్బని రాజమల్లు, శంకర్, శాంతయ్య కుటుంబ సభ్యులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

కోల్‌సిటీ, ఏప్రిల్ 21:రామగుండం నగర పాలక సంస్థ 12వ డివిజన్ పరిధి ఫైవింక్లయిన్ ఏరియాలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను ఆ డివిజన్ కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్ ఆదివారం పరిశీలించారు. 14వ ఆర్థిక సంఘం నుంచి రూ.10లక్షలతో చేపట్టిన ఈ సిమెంట్ రోడ్డు నిర్మాణం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను కోరారు. తమ డివిజన్‌కు సిమెంట్ రోడ్డు కావాలని ప్రతిపాదించగా స్పందించి రోడ్డు మంజూరు చేసిన నగర పాలక సంస్థ అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ధర్మారం,ఏప్రిల్21: మల్లాపూర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది గురుకుల విద్యాలయాల్లోని 6,7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఇక్కడి గురుకుల పరీక్ష కేంద్రానికి 392 మంది విద్యార్థులను కేటాయించగా 333 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. విద్యాలయం ప్రిన్సిపాల్ సీహెచ్ గిరిజ ఈ పరీక్షను పర్యవేక్షించారు.